క్లుప్తంగా

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



రవీంద్రనగర్‌లో యువతకు అవగాహన కల్పిస్తున్న ఆరిలోవ సీఐ గోవిందరావు

ఆరిలోవ: ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి చర్యలు చేపడుతున్నామని, ఇందుకు యువత సహకరించాలని ఆరిలోవ సీఐ జి.గోవిందరావు తెలిపారు. ఆరిలోవ ప్రాంతం రవీంద్రనగర్, ఆదర్శనగర్ ప్రాంతాలలో యువకులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అల్లర్లు, కొట్లాటలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. గొడవల్లో యువకులు తలదూర్చవద్దన్నారు. మద్యం, గంజాయి తాగి వాహనాలు నడపడం, బైక్ రేసులు నిర్వహించడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం, తదితర వాటికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం స్థానిక పెద్దలతో మాట్లాడి అవగాహన కల్పించారు. స్థానికంగా ఎలాంటి భద్రతాపరమైన సమస్యలు తలెత్తినా వాటిపై వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఐ సూచించారు.

7న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 7న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు యోగా కేంద్రంలో అజీర్తి, మలబద్ధకం, గ్యాస్ట్రిక్ సంబంధిత సమస్యలపై చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. కేజీహెచ్ విశ్రాంత సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.ఈశ్వరరావు రోగులను పరీక్షించి, తగిన చికిత్స విధానాలు సూచిస్తారని తెలిపారు. రోగులు తమ వ్యాధి సంబంధిత రిపోర్టులను తమ వెంట తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు 94401 91673 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

శ్రీరామ నవమి ఉత్సవాలకు ఏర్పాట్లు



పాత వెంకోజీపాలెంలో సుందరంగా తీర్చిదిద్దిన శ్రీరామాలయం

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డులోని రామాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రామాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నెల 9న ఉగాది వేడుకలను నిర్వహించనున్నారు. అదే రోజు నుంచి తొమ్మిది రోజుల పాటు నవమి ఉత్సవాలు జరిపేందుకు నిర్వాహకులు సన్నాహాలు పూర్తి చేశారు. ఉగాది రోజున రాట వేయనున్నారు. హనుమాన్ సీతారామా లక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ప్రజలు ముస్తాబు చేస్తున్నారు.

వంశపారంపర్యంగా కంటి వ్యాధుల వ్యాప్తి



మాట్లాడుతున్న వీరేంద్ర సచ్‌దేవా

ఆరిలోవ: కంటి వ్యాధులు వంశపారంపర్యంగా ఎక్కువగా సంక్రమిస్తాయని నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ వీరేంద్ర సచ్‌దేవా తెలిపారు. హనుమంతవాక జంక్షన్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో శనివారం కంటి వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వ్యాధులు ఎక్కువగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే జన్యుపరమైనవన్నారు. దగ్గర బంధువుల మధ్య జరిగే వివాహాల కారణంగా జన్మించిన పిల్లల్లో ఎక్కువగా కంటి సమస్యలు వస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు ముందు జాగ్రత చర్యల్లో భాగంగా కంటి వైద్య నిపుణులు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో 'తూర్పు' అభివృద్ధి బాట

- ఆ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఎంవీవీ, బొత్స ఝాన్సీ
- 9వ వార్డులో 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం'సభ



9వ వార్డు సిద్ధం సభలో మాట్లాడుతున్న పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాతే విశాఖ తూర్పు నియోజకవర్గం అభివృద్ధి బాట పట్టిందని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 9వ వార్డు పరిధి రామాలయం వీధిలో శనివారం 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం'సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నో ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయకుండా మద్యం వ్యాపారం చేసుకుంటూ కలం గడిపారని ఆరోపించారు. ఈ సారి ఎన్నికల్లో ఆయనకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. వలంటీర్లపై చంద్రబాబు ఫిర్యాదుతో పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు నానా అవస్థలు పడ్డారన్నారు. అనంతరం పార్టీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తారీఖున ఇంటికి వెళ్లి పింఛను అందించే వలంటీర్లను చంద్రబాబు ఆపించేశారన్నారు. దీంతో అవ్వాతాతలు, దివ్యాంగులు పింఛన్ల కోసం సచివాలయాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్రను వెనుకబాటు తనం నుంచి అభివృద్ధి వైపు పరుగులు పెట్టించాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఆమె కోరారు. ప్రజలు ఆలోచించి వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌పై ఓటేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, వార్డు కార్పొరేటర్ స్వాతి, జిల్లా మహిళా అధ్యక్షురాలు నల్ల కృపాజ్యోతి, రాష్ట్ర కార్యదర్శి పి.వి.నారాయణ, ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, పార్టీ నాయకుడు జి.వెంకటరామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



సిద్ధం సభలో పాల్గొన్న ప్రజలు

ఘనంగా ఉగాది సంబరాలు



పంచాంగకర్త శ్రీనివాసశర్మను సత్కరిస్తున్న కంచర్ల, అర్చక సంఘం సభ్యులు

ఆరిలోవ: ముడసర్లోవ ప్రాంతంలో ఆరిలోవ ప్రెస్‌క్లబ్‌లో శనివారం బాలబాను అర్చక, పురోహిత సంఘం ఆధ్వర్యంలో ఉగాది సంబరాలను ఘనంగా జరిగాయి. ముందుగా వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యఅతిథిగా ఉపకార్ సేవా సంస్థ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు పాల్గొని అర్చక, పురోహిత సంఘం సభ్యులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం దైవ కార్యక్రమాలలో పాల్గొంటున్న పురోహితులు, అర్చకుల సంక్షేమం కోసం తనవంతు సహకారం అందిస్తామన్నారు. పంచాంగ కర్త తెన్నేటి శ్రీనివాసశర్మ మాట్లాడుతూ బ్రాహ్మణులు సమష్టిగా సమస్యలు పరిష్కారం దిశగా సాగాలని సూచించారు. పురజనులు హితం కోరుకొనే బ్రాహ్మణుడు సమాజంలో మార్గదర్శిగా గుర్తింపు పొందాలన్నారు. అనంతరం ఆయన పంచాగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులకు నూతన పంచాంగం, వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కామేశ్వరశర్మ, కార్యదర్శి మావుదూరు కిశోర్‌కుమార్, వ్యవస్థాపకుడు పంతుల వెంకటరమణ, సభ్యులు పాల్గొన్నారు.

పలువురికి ఎంపీ ఎంవీవీ పరామర్శ



సత్తయ్యను పరామర్శిస్తున్న ఎంవీవీ తదితరులు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డులో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పలువురిని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పరామర్శించారు. అప్పుఘర్, ముచ్చలవానిపాలెంతో పాటు పలు ప్రాంతాల్లో వైద్య చికిత్స పొందుతున్న మారుపల్లి సత్తయ్య(60), పుక్కళ్ల దానయ్య(58), గరికిన ఎల్లాజీ(25), టి.లక్ష్మి(55), వాసుపల్లి భీమారావు(60), ఐ.లక్ష్మి(30), ఉమ్మిడి ఎల్లయ్యమ్మ(68) లను పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున చికిత్సకు అవసరమైన అన్ని రకాల తోడ్పాటు అందిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎంవీవీ సమక్షంలో పలువురు చేరిక

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు జాలరిపేటలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 50 మంది యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు సూరాడ దాసు ఆధ్వర్యంలో లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా రంజక పాలనకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు వారు వెల్లడించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అఖండ విజయానికి పెద్ద ఎత్తున కృషి చేయాలని వారికి ఎంపీ సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు గంపల వెంకటరామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

17వ వార్డులో అక్రమ కట్టడం కూల్చివేత



17వ వార్డు శెట్టిబలిజ వీధిలో భవనం శ్లాబ్‌కు రంధ్రాలు చేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డు పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన పలు అక్రమ కట్టడాలపై జీవీఎంసీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పెదవాల్తేర్ శెట్టిబలిజ వారి వీధిలో నిబంధనలకు విరుద్ధంగా గొంగల శ్రీనివాస్ నిర్మించిన బహుళ అంతస్తుల భవనంపై చర్యలు తీసుకున్నారు. నాలుగో అంతస్తుకు జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ కార్యదర్శి జాన్ పర్యవేక్షణలో సిబ్బంది రంధ్రాలు చేశారు. 10 అడుగులు కూడా లేని రోడ్డులో 250 గజాల్లో రెండు బ్లాకులుగా జీ+4 నిర్మాణం సెట్ బ్యాక్స్ లేకుండా చేపట్టడంపై జీవీఎంసీ కమిషనర్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. కూల్చిన భవనాల్లో మరోసారి నిర్మాణం చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ కార్యదర్శి జాన్ హెచ్చరించారు.

11వ వార్డులో 10 మంది వలంటీర్ల రాజీనామా

ఆరిలోవ: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వలంటీర్లపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలకు సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నాలుగున్నరేళ్లకు పైగా అందిస్తున్న సేవలను ఎన్నికల కారణం చూపి నిలిపేశారని, తమపై కేసులు పెడుతున్నారని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వలంటీర్లు ఒక్కొక్కరుగా విధుల నుంచి తప్పుకుంటున్నారు. ఇందులో భాగంగా శనివారం జీవీఎంసీ 11వ వార్డులో 10 మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను సంబంధిత అధికారులకు అందజేశారు. వార్డు పరిధిలోని 13వ సచివాలయంలో యాగంటి నీలివేణి, చొప్ప మదన్‌మోహన్, సెలిపరశెట్టి వినయ్‌సాగర్, 15వ సచివాలయంలో కాళ్ల సంతోష్, రైతు పరమేష్, బంకపల్లి రమాదేవి, 18వ సచివాలయంలో జడ్డిపిల్లి మణి, 19వ సచివాలయంలో ఉప్పాటి ప్రసాద్, వాసుపల్లి వంశీ, అలుగోలు శివ సత్యనారాయణ రాజీనామా చేశారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత విధుల నుంచి తమను ఆపేశారని, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నామని తమపై కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్న కారణంగా తాము రాజీనామా చేస్తున్నామని ఈ మేరకు రాజీనామా పత్రంలో పేర్కొన్నారు.

రూ.2.80 లక్షల స్వాధీనం

బీచ్‌రోడ్డు: సరైన పత్రాలు లేకుండా పట్టుకుని వెళ్తున్న రూ.2.80 లక్షల నగదును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకుంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మానసిక ఆస్పత్రి వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్‌గా పని చేస్తున్న కె.స్పందన ప్రపూర్ణ చౌదరి అనే మహిళ ఏపీ39డీఎల్0959 కారులో అటుగా రావడంతో కారును ఆపి తనిఖీ చేశారు. అందులో రూ.2.80 లక్షల నగదును గుర్తించారు. దీనికి సంబంధించిన ఎటువంటి పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

'నా ఆరోగ్యం.. నా హక్కు'పై అవగాహన

బీచ్ రోడ్డు: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది నా ఆరోగ్యం.. నా హక్కు అనే థీమ్ ప్రకటించిందని ప్రఖ్యాత న్యూట్రిషన్ నిపుణులు షీలా కృష్ణస్వామి తెలిపారు. ఈ మేరకు బీచ్ రోడ్డులో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీలా మాట్లాడుతూ మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సమతుల్య ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వడం అవసరమన్నారు. మన ఆహారంలో పోషకాలతో కూడిన బాదం పప్పు వంటి డ్రైఫ్రూట్స్‌ను చేర్చుకోవాలన్నారు. తద్వారా బ్లడ్ షుగర్, గుండె ఆరోగ్యం, చర్మ ఆరోగ్యం, బరువు నిర్వహణ వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైటిటిక్స్ రితికా సమద్దర్, తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు ఆంగ్లం తప్పనిసరి

మద్దిలపాలెం : ఆంగ్లంలో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. కళాశాల ఆంగ్ల అధ్యాపకుడు డాక్టర్ సి.వి.ఎస్.రవీంద్ర విద్యార్థులు సులభ పద్ధతిలో ఆంగ్ల భాషను నేర్చుకునే విధంగా ఎ కోర్సు ఇన్ రీడింగ్ అండ్ రైటింగ్‌పై పలు పుస్తకాలు రచించారు. ఈ పుస్తకాలను శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆంగ్లంలో పట్టు సాధించాలని ఆకాంక్షించారు. అప్పుడే ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చునని చెప్పారు.



విద్యార్థులకు ఆంగ్లం స్టడీ మెటీరియల్ అందిస్తున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

ప్రకృతి వ్యవసాయదారులకు పురస్కారాల ప్రదానం నేడు

మద్దిలపాలెం : విశాలాక్షినగర్‌లోని బీవీకే కళాశాలలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఉగాది సంబరాలు నిర్వహించనున్నట్టు గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యవర్మ తెలిపారు. ఈ మేరకు ఉత్సవాల పోస్టర్‌ను శివాజీపాలెంలోని సంఘం కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయదారులను ప్రోత్సహించడానికి ఉగాది పురస్కారాలు అందజేయనున్నామన్నారు.



ఉగాది పురస్కారాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

బాబ్జీకి వేముగంటి ఉగాది పురస్కారం



వేముగంటి ఉగాది పురస్కారం స్వీకరిస్తున్న రచయిత, కవి డాక్టర్ బాబ్జీ

మద్దిలపాలెం : నగరానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, ఏవీఎన్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ రఘుపాత్రుని గణేశ్వర బాబ్జీకి శ్రీవేముగంటి నర్సింహాచార్యుల క్రోధినామ సంవత్సర ఉగాది పురస్కారం లభించింది. తెలంగాణా రాష్ట్రం సిద్దిపేటలో వెన్నెల సాహితీ సంఘం ఆధ్వర్యంలో శనివారం కవి సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో తెలంగాణా రాష్ట్ర రచయితల సంఘం అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.యాదగిరి, సంస్థ అధ్యక్షుడు వి.నరసింహారెడ్డి చేతుల మీదుగా డాక్టర్ బాబ్జీ ఈ పురస్కారం స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రచయిత బాబ్జీ సాహితీ సేవలను కొనియాడారు. తెలంగాణా రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన పురస్కారాన్ని తనకు అందించి సత్కరించిన నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఏయూ సమాచారమ్

జియోఫిజిక్స్ విద్యార్థులకు ఉపకార వేతనాలు



విశ్రాంత అధికారిని సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఫిజిక్స్ విభాగం విద్యార్థులకు ఓఎన్‌జీసీ విశ్రాంత డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.చంద్రబాబు ఉపకార వేతనాలను అందించడానికి ముందుకు వచ్చారు. శనివారం విభాగంలో విద్యార్థులకు రూ.16 వేలు ఉపకార వేతనంగా అందించారు. ప్రతి నెల విభాగంలో విద్యార్థులకు రూ.3 వేలు అందిస్తానన్నారు. ఏయూ విద్యార్థులను ప్రోత్సహిస్తూ, ఉపకార వేతనాలు అందించడానికి ముందుకు వచ్చిన ఓఎన్‌జీసీ విశ్రాంత అధికారి చంద్రబాబుని ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ప్రతిభ కలిగి, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఇటువంటి సహాయం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సి.వి.నాయుడు, విభాగ ఆచార్యులు పి.త్రినాథరావు, ఎం.జగన్నాథరావు, ఆచార్య జి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.జె.ప్రకాష్, ఆనంద్ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించండి



న్యూట్రికో సంస్థ ప్రతినిధులతో ఏయూ వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ప్రతిభావంతులైన ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో శనివారం న్యూట్రికో సౌత్ ఏషియా సంస్థ ఎండీ డాక్టర్ సౌరభ్ శేఖర్ నేతృత్వంలోని సంస్థ ప్రతినిధులు ఏయూ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏయూతో అవగాహన ఒప్పందం చేసుకోవడం, విద్యార్థులకు ఉపాధి కల్పన, ప్రాంగణ నియామకాల నిర్వహణ, తదితర అంశాలపై ప్రాథమికంగా చర్చించారు. ఈ సందర్భంగా ఏయూ తరపున సౌరభ్ శేఖర్‌ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఎంఎల్ఆర్ విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు, విభాగ ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటస్వామికి ఉగాది పురస్కారం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆచార్యుడు డాక్టర్ బూసి వెంకటస్వామికి మద్రాస్ విశ్వవిద్యాలయం ఉగాది పురస్కారాన్ని ప్రదానం చేయడంపై ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం తన కార్యాలయంలో వెంకటస్వామిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, డీన్ డాక్టర్ జి.వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.



వెంకటస్వామిని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

వైఎస్సార్‌సీపీ విస్తృత ప్రచారం



17వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. శనివారం 17వ వార్డులో జోరుగా కొనసాగింది. ఇందులో భాగంగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ 83వ రోజు 17వ వార్డు సెక్టార్-8లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌కు ఓటేసి తనను తూర్పు ఎమ్మెల్యేగా, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను రాష్ట్రంలోని ప్రతి ఇంటికి చేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు, పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

16వ వార్డులో..

మద్దిలపాలెం : వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బొత్స ఝాన్సీ, విశాఖ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకు మద్దతుగా ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు విస్తృత ప్రచారం చేస్తున్నారు. దీనిలో భాగంగా 16వ వార్డు అంబేడ్కర్ కాలనీలో శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన రావాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటేసి మద్దతు తెలపాలని అప్పారావు కోరారు. ఈ ప్రచారంలో పార్టీ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, సచివాలయాల కన్వీనర్ పార్వతీ, సంధ్య, బీఎల్‌వోలు గుర్ల వెంకటరమణ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



16వ వార్డు అంబేడ్కర్ కాలనీలో ప్రచారం చేస్తున్న మొల్లి అప్పారావు

యువజనుల సాధికారతకు కృషి అవసరం



ప్రసంగిస్తున్న న్యాయమూర్తి విజయ్‌చందర్

ఏయూ క్యాంపస్: యువజనుల సాధికారతకు కృషి చేయాలని, వెనకబడిన వర్గాల అభ్యున్నతికి సాధ్యమైనంత వరకు న్యాయ సహాయం అందించాలని విజయనగరం జిల్లా కొత్తవలస సివిల్ జడ్జి డాక్టర్ ఎస్.విజయచందర్ పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. మార్పునకు వాహకాలుగా జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లు నిలుస్తారన్నారు. రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ ఆచార్యులు డాక్టర్ వాసంతి రాజేంద్రన్ వర్చువల్ విధానంలో మాట్లాడుతూ ఇక్కడ ప్రోగ్రాం అధికారులు నేర్చుకున్న వైవిధ్యమైన జ్ఞానాన్ని వలంటీర్లకు చేరువ చేయాలని, తద్వారా సమాజంలోని ప్రజలకు అవి చేరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పటిష్టమైన యువజన నాయకత్వాన్ని దేశానికి అందించడం ధ్యేయంగా రాజీవ్ గాంధీ జాతీయ యువజన అభివృద్ధి సంస్థ పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, కన్వీనర్ డాక్టర్ కె.పల్లవి, జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ మాణిక్యకుమారి, డాక్టర్ చంద్, డాక్టర్ ప్రతాప్, వై.అనసూయదేవి తదితరులు శిక్షణపై తమ అభిప్రాయాలను తెలయజేశారు. చివరి రోజు కార్యక్రమంలో భాగంగా పోక్సో చట్టంపై డాక్టర్ పల్లవి, వినియోగదారుల హక్కులపై ఆచార్య రాజేంద్రప్రసాద్, మానవ హక్కులు-యువత పాత్రపై ఆచార్య రాజ్యలక్ష్మి కీలకోపన్యాసాలు చేశారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న ప్రోగ్రాం అధికారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.